క్లుప్తంగా

సమస్యలపై స్పందించండి

మార్కాపురం టౌన్: ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను అధికారులు పరిశీలించి వాటిని పరిష్కరించాలని అధికారులను సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మార్కాపురం మండలం బోడపాడు గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ భూములను గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయమై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. తాను విచారణ జరిపిస్తానని తెలిపారు. మీ కోసం కార్యక్రమంలో నియోజకవర్గంలోని డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులో స్వల్ప అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పే విధానాన్ని వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

మార్కాపురం: పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న ఒక ప్రధాన బ్యాంకులో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. మేనేజర్ చాంబర్‌లో ఉన్న ఏసీ నుంచి నిప్పురవ్వలు రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపుచేశారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

పొదిలి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. గుంటూరులో న్యాయవాది బి.నాగరాజు, మంగళగిరిలో న్యాయవాది జి.గవాస్కర్ మీద అక్రమ కేసులు బనాయించిందుకు నిరసనగా విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణకిషోర్ తెలిపారు. నిరసన కార్యక్రమంలో కార్యదర్శి షేక్.షబ్బీర్, న్యాయవాదులు ఉడుముల లక్ష్మిరెడ్డి, బి.సురేష్‌కుమార్, టి.రామమోహనరావు, జి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎ.సురేష్‌కుమార్, సుజాత, సలీమ్, కిషోర్, గౌతమి, మహేష్‌బాబు, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న పీఎల్‌పీ యాదవ్

మార్కాపురం: బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బీసీ సంఘం నేత గోసు వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా ఫంక్షన్ హాల్లో బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ తాను కరోనా సమయంలో ఆర్థిక, సామాజిక సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నానని, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలతోపాటు బీసీల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ అటు ఉపాధ్యాయ వృత్తిలో, ఇటు సామాజిక సేవలో సుబ్బారావు పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పల్లెబోయిన వెంకటరాజుయాదవ్, బీసీ సంఘ అధ్యక్షుడు ఐ.రంగస్వామి గౌడ్, గుమ్మా గంగరాజు, ఒంటేరు నాగేశ్వరరావు, చక్రపాణి, శివకుమార్, బత్తుల పెద్దఅల్లూరయ్య, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్/పొదిలి: మార్కాపురం తహసీల్దార్‌గా కె.చిరంజీవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ముందుగా ఆయన పట్టణంలోని చెన్నకేశవస్వామి గుడికివెళ్లి పూజలు నిర్వహించారు.

■ పొదిలి తహసీల్దార్‌గా ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, సాంకేతిక సమస్యను పరిష్కరించి సర్టిపికెట్లు వెంటనే అందేలా కృషి చేస్తానన్నారు. ఇన్‌చార్జ్ ఆర్‌ఐ కిలారి సుబ్బారావు ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



పొదిలిలో తహసీల్దార్ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న వీఆర్‌ఓలు



మార్కాపురం జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో నీటి కోసం విద్యార్థుల అవస్థలు



నాలుగు సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్న జెడ్పీ బాలికల హైస్కూల్



35 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్న ఎంపీ చెరువు ప్రాథమిక పాఠశాల

సర్కారు విద్యపై సవతి ప్రేమ

"ఇంగ్లిష్ మీడియంతో ఏమొస్తుంది? మూడో తరగతి నుంచి టోఫెల్ అవసరమా?.." ఇవీ ప్రతిపక్షంలో ఉండగా నారా చంద్రబాబు నాయుడు అండ్ కో మాట్లాడిన మాటలు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే సర్కారు విద్యను నిర్వీర్యం చేసే కుట్రలకు మరింత పదును పెడుతోంది. ఎన్నికల ప్రచారంలో "నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు.." అంటూ కూటమి నేతలు చెప్పిన మాటలు నమ్మి పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా తల్లుల ఖాతాల్లో జమ కాలేదు. ఫీజులెలా కట్టాలో తెలియక తల్లిదండ్రులు తలపట్టుకుంటున్నారు. సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం మౌనం దాల్చిన ప్రభుత్వం.. మధ్యాహ్న భోజన ఏజెన్సీలను టీడీపీ నేతలకు కట్టబెట్టే క్రమంలో నాణ్యతకు తిలోదకాలిచ్చింది.

- ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం దిశగా అడుగులేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు ఉద్వాసన
- నూతన ఏజెన్సీల నియామకంతో మధ్యాహ్న భోజనంలో తగ్గిన రుచులు
- గోలీ సైజు గుడ్లు, దొడ్డు బియ్యంతో ఐదేళ్ల క్రితం నాటి పరిస్థితులు
- పూర్తి స్థాయిలో అందని విద్యాకానుక కిట్లు
- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కొరత
- టోఫెల్‌కు మంగళం

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

మార్కాపురం/మార్కాపురం టౌన్/మార్కాపురం రూరల్/తర్లుపాడు/కొనకనమిట్ల/పొదిలి రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా విద్యావ్యవస్థ 50 రోజుల్లో అస్తవ్యస్తంగా తయారైంది. నూతన ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభం రోజున్నే అందరికీ జగనన్న విద్యాకానుకలు, అదే నెలలో అమ్మ ఒడి నిధులు ఇవ్వగా నూతన ప్రభుత్వంలో విద్యార్థులకు ఇవన్నీ దూరమైపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే జూన్‌లోనే విద్యా కిట్లు, తల్లికి వందనం వస్తుందని ఆశతో ఎదురుచూసిన తల్లిదండ్రుల ఆశలు నిరాశగా మిగిలాయి. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీపై సర్కారు నేటికీ ఎలాంటి ప్రకటన చేయలేదు. విద్యాకానుక కిట్లు మొదటి విడత మాత్రమే సరఫరా చేశారు. నూతనంగా చేరిన వారు స్కూల్ కిట్ల కోసం ఎదురు చూస్తున్నారు.

96 టీచర్ పోస్టులు ఖాళీ

మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల మండలాలు ఉన్నాయి. మొత్తం 287 పాఠశాలలు ఉండగా, 27,105 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు రద్దుచేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. అన్ని పాఠశాలల్లో కలిపి 96 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్, పీఈటీ తదితర టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధనపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఓ వైపు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు సమీపిస్తుండటం, మరో వైపు సిలబస్ పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొనకనమిట్ల మండలం ఓబులక్కపల్లిలో విద్యార్థులు లేక ఎలిమెంటరీ పాఠశాల మూతపడింది. పొదిలి మండలంలో 30 ఏళ్లుగా పిల్లలతో కళకళలాడిన అక్కచెరువు పాఠశాల ఈ ఏడాది విద్యార్థులే లేక మూతవేశారు.

సొంత మెనూ.. పెట్టిందే తిను..

విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చారుగానీ రుచికరమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కుకింగ్ ఏజెన్సీలను మార్చడంతో భోజనంలో నాణ్యత తగ్గి అర్ధాకలితో ఉంటున్నారు. నాణ్యమైన బియ్యం బదులు దొడ్డు బియ్యం వండి పెడుతుండటం గమనార్హం. విద్యార్థులకు గోలీ సైజు కోడిగుడ్లు అందిస్తున్నారు. దరిమడుగు, వేములకోట, తిప్పాయపాలెం, మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలు చేయడం లేదు. విద్యార్థులు ఇంటి నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా తయారైంది.



మూతబడిన పొదిలి మండలం అక్కచెరువు పాఠశాల

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. గిద్దలూరు నియోజకవర్గంలో చాలా పాఠశాలల్లో విద్యాకానుక కిట్లను పంపిణీ చేయలేదు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ప్రధాన సబ్జెక్ట్‌లను బోధించే ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండటంతో విద్యార్థుల చదువు ముందుకు సాగడం లేదు. టీచర్ల కొరత పరిష్కరించి, విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 41 హైస్కూల్స్ ఉన్నాయి. 466 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా 123 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 45 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఉన్నాయి. గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినా కూటమి నాయకులు కోర్టులకు వెళ్లి పోస్టులను భర్తీ చేయకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులను బదిలీ చేసింది. కూటమి నాయకులు ఉపాధ్యాయులు విధుల్లో చేరకుండా అడ్డుకున్నారు. ఫలితంగా ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకంగా మారింది.



నాణ్యత లేని దొడ్డు బియ్యం

మార్కాపురం నియోజకవర్గంలో **96** టీచర్ పోస్టులు ఖాళీ
విద్యార్థులు లేక రెండు పాఠశాలలు మూసివేత
గిద్దలూరు నియోజకవర్గంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు **34**
హైస్కూల్స్‌లో **123** పోస్టులు, ప్రాథమిక పాఠశాలల్లో 45 పోస్టులు ఖాళీ

అన్నీ సబ్జెక్ట్‌లకు ఒకే ఉపాధ్యాయుడు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలలు 34 ఉన్నాయి. సింగిల్ టీచర్ 1 నుంచి ఐదు తరగతులకు అన్ని సబ్జెక్ట్‌లూ చెప్పాల్సిందే. ఎస్జీటీ టీచర్ల కొరత ఉండటంతో సింగిల్ టీచర్లతో స్కూల్స్ నెట్టుకొస్తున్నారు. అదే విధంగా సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉంది. ప్రధాన సబ్జెక్ట్‌లైన ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్ట్‌లకు టీచర్లు లేరు.

టోఫెల్ తరగతులకు మంగళం

ఇంగ్లిష్ ప్రావీణ్యం పెంపొందించడానికి ప్రభుత్వ బడుల్లో గత ప్రభుత్వం టోఫెల్ తరగతులు ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్ కేటాంచారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి మార్చిలో పరీక్షలు కూడా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఆ పరీక్ష ఫలితాలు ప్రకటించ లేదు. ఏకంగా టోఫెల్ విద్యకే మంగళం పాడింది. ఫలితంగా నియోజకవర్గంలోని 30,379 వేల మంది విద్యార్థులు నష్టపోతున్నారు.

■ నియోజకవర్గంలో పదో తరగతి, 8వ తరగతి విద్యార్థులకు సరిపడా విద్యాకానుక కిట్లు అందలేదు. పాత ఇండెంట్ ప్రకారం కిట్లు రావడంతో కొత్తగా చేరిన విద్యార్థులకు కొరత ఏర్పడింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

■ కుకింగ్ ఏజెన్సీలు, హెల్పర్‌లకు రెండు నెలలుగా జీతాలు అందలేదు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చండి

మార్కాపురం: విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అన్నా కృష్ణచైతన్య సూచించారు. సోమవారం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అత్యున్నత సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. తమ కళాశాల విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తుండటం గర్వంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ అనీల్‌కుమార్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు



శేషావలికి చెందిన భవనానికి పార్కింగు లేకుండా నిర్మిస్తున్న వైనం



రోడ్డును బ్లాక్ చేసి స్లాబ్ వేస్తున్న యజమాని

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీలోని రైల్వేస్టేషన్ రోడ్డు, పెద్దపోస్టాఫీసు రోడ్డు, మెయిన్‌బజారు, ప్రధాన రహదారుల్లో సైతం నిర్మాణాలను అడ్డగోలుగా నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా రోడ్లు వెడల్పు లేకపోవడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో అనేక ఇబ్బందులు పడుతుంటారు. అనుమతులు మాత్రం కాగితాల్లో అన్ని కరెక్టుగా ఉన్నట్లు చూపుతుంటారు. స్థలం మీద మాత్రం వారి ఇష్టానుసారంగంగా నిర్మిస్తుంటారు. నిబంధనల ప్రకారం వ్యాపారసముదాయం గల ప్రాంతాల్లో నిర్మాణలు చేపట్టే బహుళ అంతస్తులకు కచ్చితంగా పార్కింగ్ స్థలం చూపి అనుమతులు పొందాలి. అలా పొందిన అనుమతుల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. దీని వల్ల ఆ భవంతుల్లో నిర్మించే గదుల్లో నిర్వహించబోయే వ్యాపార సంస్థల వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌లో ఏర్పాటు చేసుకునేందుకు వీలు ఉంటుంది. అలా కాకుండా వారు పార్కింగ్ లేకుండా నిర్మిస్తే వాహనాలన్నీ రోడ్ల మీదనే పెడుతుంటారు. దీంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య మరింత ఉత్పన్నం అవుతుంది. ముందుగా నగర పంచాయతీయ కార్యాయలంలో కమర్షియల్ ఏరియాకు సంబంధించిన ప్రదేశాల్లో సైతం రెసిడెన్షియల్‌కు సరిపడా అనుమతులు పొంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు ఎదురుగా శేషావలికి చెందిన స్థలంలో మూడు అంతస్తుల భవంతి నిర్మాణం చేపట్టారు. ఆ భవనానికి పార్కింగ్ స్థలం చూపకుండానే బహుళ అంతస్తుకు ఎలా అనుమతులు ఇచ్చారో ఇచ్చిన అధికారులకే తెలియాలి. భవన నిర్మాణానికి సోమవారం రోజు స్లాబ్ వేస్తున్నారు. దీంతో భవనపు యజమాని శేషావలి రోడ్డుకు అడ్డంగా కర్రలు కట్టి రోడ్డును బ్లాక్ చేసి స్లాబ్ వేస్తున్నాడు. దీంతో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు సైకిల్ ఎత్తుకుని మరీ అవస్థలు పడుతూ రోడ్డును దాటుతున్నారు. మరి కొందరు రోడ్డును దాటలేక మరో రోడ్డు మీదుగా వెళ్లారు. కమర్షియల్ ఏరియాలో పార్కింగ్ స్థలం లేకుండా ఎలా అనుమతులు ఇచ్చారంటూ వాహనదారులు మండిపడుతున్నారు. యూనియన్ బ్యాంకు, పెద్దపోస్టాఫీసు వీధిలో ఇటీవల నిర్మించిన భవనంతో బ్యాంక్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అధికారుల అడ్డగోలు అనుమతులతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణం పరిధిలో ఇలా అయితే పట్టణశివారు ప్రాంతంలో ఇక చెప్పలేని అంతగా అవినీతి అనుమతులు లోపాయికార ఒప్పందాలు కుదుర్చుకుని అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు.

చెట్ల తీగలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రాచర్ల: మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లెలో విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారిందని జూలై 29వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన..పొంచి ఉన్న ప్రమాదం అనే వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. గ్రామ చివరిలో ఉన్న విద్యుత్ స్తంభానికి పూర్తిగా అల్లుకునిపోయిన చెట్ల తీగలను విద్యుత్ అధికారులు సోమవారం తొలగించించారు.



చెట్ల తీగలు తొలగించిన తర్వాత విద్యుత్ స్తంభం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లె 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శింగరపల్లె, చెన్నుపల్లె, కోనపల్లె, హనుమాయపల్లె, బార్లకుంట గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆటోలపై ఎంవీఐ కొరడా



అధిక లోడుతో వెళ్తున్న ఆటోపై కేసు నమోదు చేస్తున్న ఎంవీఐ

సాక్షి ఎఫెక్ట్..


కంభం: ఆటోల్లో ప్రమాదకర ప్రయాణాలపై సోమవారం సాక్షి దినపత్రికలో 'యమ డేంజర్' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు సోమవారం సాయంత్రం కంభం, బేస్తవారిపేట పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అధిక మంది ప్రయాణికులు, అధిక లోడుతో వెళ్తున్న ఆటోలకు జరిమానా విధించారు. కంభంలో-3, బేస్తవారిపేటలో-3 ఆటోలపై కేసులు రాసి రూ.70 వేల జరిమానా విధించినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

డయాలసిస్ సెంటర్ ప్రారంభం

గిద్దలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయాలని కోరారు. జెడ్పీటీసీ బుడత మధుసూదనరావు, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైద్యశాల సూపరింటెండెంట్ సూరిబాబు, వైద్యులు ఆసియా సుధాకర్, ఖాదరయ్య, సౌమ్య, గౌసియా, షాలిని, విజయభాస్కర్, ఆదాం, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

గిద్దలూరు రూరల్: మండలంలోని ఓబులాపురం తండా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను స్థానిక సెబ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. అందిన సమాచారం మేరకు ఓబులాపురం తండా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నారని తెలియడంతో సీఐ కొండారెడ్డి తన సిబ్బందితో సహా అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. దాడుల్లో వారు నాటుసారా తయారీ కేంద్రం గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. వాటితో పాటు 10 లీటర్ల నాటుసారాను ఒక ద్విచక్రవాహనం, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పారిపోయినట్లు గుర్తించారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

షాలెంరాజు కుటుంబ సభ్యులకు అన్నా పరామర్శ

కంభం: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి శాలెంరాజు తల్లి భాగ్యమ్మ మూడు రోజుల క్రితం మృతి చెందిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు సోమవారం షాలెంరాజు గృహానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు రావూరి జనార్దన్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, ఎంపీటీసీ ఆనంద్ ప్రదీప్, హుస్సేన్ బాషా, సగిలి ప్రభాకర్, కొత్తూరు, మనోజ్, లక్ష్మణ్ ఉన్నారు.



షాలెంరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

ఫాగింగ్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

కంభం: పారిశుద్ధ్యం అధ్వానంగా మారి రోగాలు ప్రబలుతున్న నేపథ్యంలో 'సాక్షి'లో ఇటీవల వస్తున్న వరుస కథనాలకు స్పందించి పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టిసారించారు. కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ వేయడం, గృహాల బయట తొట్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం కంభం పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ ప్రారంభించారు. సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఉప సర్పంచి సయ్యద్ ఖాసిం, ఎంపీడీఓ మస్తాన్ వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



కంభంలో ఫాగింగ్ ప్రారంభిస్తున్న అధికారులు

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

గిద్దలూరు రూరల్: బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఆటో ఢీకొట్టిన సంఘటన పట్టణంలోని ముండ్లపాడు రోడ్డు బలిజసంఘం కార్యాలయం వద్ద సోమవారం జరిగింది. నాగులవరానికి చెందిన లక్ష్మీ రంగారెడ్డి మరో వ్యక్తి బైక్‌పై వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో లక్ష్మీరంగారెడ్డి స్వల్పంగా గాయాలయ్యాయి. అనంతరం అతడిని స్థానికులు చికిత్స కోసం ఏరియా వైద్యశాలకు తరలించారు.